

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 12-09-2026 | సంపుటి - 31 | సంచిక - 110 | రూ : 4 | పేజీలు: 8


## విజిలెన్స్ నివేదికను అడ్డంపెట్టుకొని..

# ఫిరాయింపులను ప్రోత్సహించారు

### కేసీఆర్‌పై సీఎం రేవంత్ ధ్వజం

- వారికి అనుకూలంగా ఉన్న కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించారు
- మా ప్రభుత్వంలో నిజాయతీగా ఉన్న కాలేజీలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉంటుంది
- పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించం.. అవసరమైతే జీవో 97ని సవరిస్తాం
- అసెంబ్లీలో విద్యపై విస్తృతస్థాయి చర్చలో సీఎం స్పష్టీకరణ



హైదరాబాద్: 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన కళాశాలలపై నాడు కేసీఆర్ విజిలెన్స్ విచారణ చేయించారు. కానీ చర్యలు తీసుకోలేదు. ఆ రిపోర్టు ఎక్కడికి పోయిందని నేను వచ్చాక ఆరా తీశా. విచారణకు ఆదేశించా. ఆ రిపోర్టును అడ్డంపెట్టుకొని అప్పట్లో ఆయన పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. వాళ్లకు అనుకూలంగా ఉన్న కళాశాలలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'కేసీఆర్ హయాంలోని మంత్రి కాలేజీలో రూ.400 కోట్లు వారి ఎకౌంట్‌లో ఉన్నాయి. అవి దోచుకున్న తరువాయి 2లో



## ఆల్ టైమ్ రికార్డ్

# ఒకే రోజులో 20 లక్షల IRCTC టికెట్లు!

- ఒక్కరోజే 20 లక్షలకు పైగా రైలు టికెట్ల బుకింగ్
- సామర్థ్యాన్ని రెట్టింపు చేసిన కొత్త సర్వర్లు, వెబ్‌సైట్
- బాట్‌లు, మోసపూరిత బుకింగ్‌లపై ఉక్కుపాదం
- 3 కోట్లకు పైగా ఫేక్ యూజర్ ఐడీల డియాక్టివేషన్

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20 తరువాయి 2లో

## ఎన్జీటీ నోటీసులు

# మూసీ ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ



- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం

2లో



## దేశంలో రెట్టింపైన

# విద్యుత్ డిమాండ్

- మే 21న 270.8 గిగావాట్లకు చేరిన గరిష్ఠ డిమాండ్
- జులై 2026 నాటికి 552 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం
- 5.10 లక్షల సర్క్యూట్ కిలోమీటర్లకు పెరిగిన ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్
- పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంలో భారత్ మూడో స్థానం

2లో

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు

# సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ




- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు

2లో



## ఏఐతో ఐసిస్ వల

# టార్గెట్ భారత యువత

- ప్రచారం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తృత వినియోగం
- భారత్‌లో మహిళలు, చిన్నారులే లక్ష్యంగా ఐసిస్, అల్-ఖైదా కార్యకలాపాలు
- లింగ భేదం, వయసు ఆధారంగా ప్రత్యేక కంటెంట్ రూపకల్పన
- దక్షిణ భారతదేశంలో ఈ తరహా కార్యకలాపాలు అధికంగా ఉన్నాయని నిఘా వర్గాల వెల్లడి

ఐసిస్, అల్‌ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా తరువాయి 2లో

## టోల్ ప్లాజాలకు

# గుడ్‌బై.. కొత్త రూల్

- ఫిబ్రవరికి బారియర్ ఫ్రీ టోల్ విధానం
- ఫాస్టాగ్‌కు నంబర్‌ప్లేట్ గుర్తింపు జత
- టోల్ ఆదాయం ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందన్న గడ్కరీ
- ఫాస్టాగ్‌తో నిరీక్షణ 80-90 శాతం తగ్గిందని వెల్లడి
- టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం ఉండదని స్పష్టీకరణ

2లో



## ఎడారిలో కొత్త నగరం

# 6,000 ఇళ్లతో 'మాన్యుమెంట్ హిల్స్'

- లాస్ వెగాస్‌లో 940 ఎకరాల ఫెడరల్ భూమిని కొనుగోలు చేసిన డెవలపర్లు
- 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో 6,000 ఇళ్లతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం
- రెండు దశాబ్దాల్లో బ్యూరో ఆఫ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ జరిపిన అతిపెద్ద భూ విక్రయం ఇది
- సైనిక కుటుంబాలకు ప్రత్యేక గృహాలు, పాఠశాలలు, పార్కుల ఏర్పాటు



- భూమి అమ్మకం ద్వారా వచ్చిన నిధులను విద్య, పర్యావరణ ప్రాజెక్టులకు కేటాయింపు

లాస్ వెగాస్‌లో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నగరంలో పెరుగుతున్న గృహ అవసరాలను తీర్చే లక్ష్యంతో 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో ఒక భారీ మాస్టర్‌ప్లాన్డ్ కమ్యూనిటీని నిర్మించేందుకు డెవలపర్లు తరువాయి 2లో

# విజిలెన్స్ నివేదికను అడ్డంపెట్టుకొని.. ఫిరాయింపులను ప్రోత్సహించారు

హైదరాబాద్: 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన కళాశాలలపై నాడు కేసీఆర్ విజిలెన్స్ విచారణ చేయించారు. కానీ చర్యలు తీసుకోలేదు. ఆ రిపోర్టు ఎక్కడికి పోయిందని నేను వచ్చాక ఆరా తీశా. విచారణకు ఆదేశించా. ఆ రిపోర్టును అడ్డంపెట్టుకొని అప్పట్లో ఆయన పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారు. వాళ్లకు అనుకూలంగా ఉన్న కళాశాలలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'కేసీఆర్ హయాంలోని మంత్రి కాలేజీలో రూ.400 కోట్లు వారి ఎకౌంట్‌లో ఉన్నాయి. అవి దోచుకున్న డబ్బులో... లేక విద్యార్థుల నుంచి వసూలు చేసిన డొనేషన్లో? పూలమ్మితే.. పాలమ్మితే అన్ని కోట్లు వస్తాయా.. నాకైతే తెలియదు' అని అన్నారు. శుక్రవారం రాత్రి అసెంబ్లీలో విద్యపై జరిగిన చర్చలో సుమారు 3 గంటలకు పైగా ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ తెచ్చిందే తామని, దాని పేటెంట్ తమదేనని.. దాన్ని రద్దు చేయబోమని స్పష్టం చేశారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ అప్పు నేను పెట్టలేదు. అది నాకు గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన అప్పు. గత ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.5,435 కోట్ల బకాయిలు పెట్టింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం పెట్టిన అప్పు రూ.1,410 కోట్లు చెల్లించింది. మా ప్రభుత్వ బకాయిలు రూ.1,465 కోట్లు ఇచ్చాం. ఈ విద్యా సంవత్సరంలోనే రూ.612 కోట్లు చెల్లించాం. ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.2,400 కోట్లు అవసరం. ఇప్పుడు డిమాండ్ చేస్తున్న భాజపా నేతలు కేసీఆర్ ఉన్నప్పుడు చేశారా? మేము మాత్రం నిజాయతీగా ఉన్న కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తాం. అక్రమాలకు పాల్పడే వారికి ఇవ్వబోం. విద్యార్థులు ఫైనల్ ఇయర్‌లో వెళ్లిపోయేటప్పుడు కొన్ని కళాశాలలు వారి నుంచి ఫీజు తీసుకుంటున్నాయి. మళ్లీ ఆ విద్యార్థుల వివరాలను నమోదు చేసి ప్రభుత్వం నుంచి కూడా రెండోసారి రీయింబర్స్‌మెంట్ పొందుతున్నాయి. మోసం చేసే కాలేజీలపై చర్యలు తీసుకుంటాం.

**ఫాంహౌస్ కుట్రలు చెల్లవు**

భారాస నేతలు పేదల భవిష్యత్‌ను దెబ్బతీసేలా రాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్న ఫాంహౌస్ కుట్రలు చెల్లవు. యువతకు విజ్ఞప్తి చేస్తున్నా.. మీ భవిష్యత్తు కోసమే ప్రభుత్వం సంస్కరణలు తెస్తోంది. మీరు మంచి వైపు నిలబడండి.

# దేశంలో రెట్టింపైన విద్యుత్ డిమాండ్

దేశంలో విద్యుత్ అవసరాలు భారీగా పెరుగుతున్నాయి. పదేళ్లలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ దాదాపు రెట్టింపైంది. 201314లో 135.9 గిగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ 2026 మే 21న రికార్డు స్థాయిలో 270.8 గిగావాట్లకు చేరింది. ఇళ్లలో విద్యుత్ వినియోగం పెరగడం, పరిశ్రమలు విస్తరించడం, వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోవడం దీనికి ప్రధాన కారణాలని కేంద్రం శుక్రవారం తెలిపింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా దేశం భారీగా పెంచింది. 2014 మార్చిలో 249 గిగావాట్లుగా ఉన్న మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2026 జులై నాటికి 552 గిగావాట్లకు చేరింది. దీంతో ప్రస్తుత అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తులో పెరగనున్న డిమాండ్‌ను ఎదుర్కొనే సామర్థ్యం పెరిగింది. విద్యుత్ సరఫరా వ్యవస్థ కూడా గణనీయంగా విస్తరించింది. 2014 ఏప్రిల్‌లో 2,91,336 సర్క్యూట్ కిలోమీటర్లుగా ఉన్న ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 2026 జులై నాటికి 5,10,594 సర్క్యూట్ కిలోమీటర్లకు చేరింది. దీంతో దేశవ్యాప్తంగా విద్యుత్‌ను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరఫరా చేయడం మరింత సులభమైంది. ఇదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలోనూ భారత్ వేగంగా ముందుకెళ్తోంది. ఐఆర్ఈఎన్ఏ విడుదల చేసిన 'రిన్యూవబుల్ ఎనర్జీ స్టాటిస్టిక్స్ 2026' ప్రకారం పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. 2026 మార్చి 31 నాటికి దేశంలో మొత్తం శిలాజేతర విద్యుత్ సామర్థ్యం 283.46 గిగావాట్లుగా ఉంది. ఇందులో 274.68 గిగావాట్లు పునరుత్పాదక ఇంధనం, 8.78 గిగావాట్లు అణు విద్యుత్ సామర్థ్యం. 202526లో రికార్డు స్థాయిలో 55.3 గిగావాట్ల శిలాజేతర సామర్థ్యం అదనంగా చేరింది. 2025 జూన్‌లో భారత్ కీలక మైలురాయిని అందుకుంది. దేశంలో మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో శిలాజేతర ఇంధనాల వాటా 50 శాతానికి చేరింది. దీంతో 2030 నాటికి చేరుకోవాల్సిన పారిస్ ఒప్పంద లక్ష్యాన్ని భారత్



# టోల్ ప్లాజాలకు గుడ్‌బై.. కొత్త రూల్

హైవేలపై టోల్ చెల్లింపుల్లో కీలక మార్పు రానుంది. ఇక వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానాన్ని తీసుకురానున్నారు. వచ్చే ఫిబ్రవరిలోగా ఈ విధానం అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ముంబైలో జరుగుతున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌కు వాహన నంబర్‌ప్లేట్ గుర్తింపు సాంకేతికతను జోడించనున్నట్లు చెప్పారు. ఫాస్టాగ్, నంబర్‌ప్లేట్ రెండింటి సాయంతో వాహనాలను గుర్తించి టోల్ వసూలు చేస్తారు. కొత్త విధానం వల్ల టోల్ వసూళ్లు ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందని గడ్కరీ చెప్పారు. టోల్ చెల్లించేందుకు వాహనాలు ఆగకపోవడంతో ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని తెలిపారు. ఫాస్టాగ్ రాకతో టోల్ ప్లాజాల వద్ద వేచి చూసే సమయం ఇప్పటికే 8090 శాతం తగ్గిందని మంత్రి చెప్పారు. గతంలో 12 నిమిషాల వరకు ఉండే నిరీక్షణ కొన్ని చోట్ల 30 నిమిషాలకు చేరేదన్నారు. ఇప్పుడు మిగిలిన ఆలస్యాన్ని కూడా సాంకేతికతతో తొలగించనున్నట్లు వివరించారు. ఫాస్టాగ్‌ను 2016లో ప్రవేశపెట్టారు. 2021లో దేశవ్యాప్తంగా తప్పనిసరి చేశారు. వాహనం టోల్ ప్లాజాను దాటుతున్నప్పుడు ఫాస్టాగ్ ద్వారా అనుసంధానిత ఖాతా నుంచి రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. నగదు చెల్లింపులతో పాటు చిల్లర కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకపోవడంతో టోల్ వసూళ్లు వేగంగా మారాయి. ఇక తదుపరి దశలో టోల్ ప్లాజాల వద్ద అడ్డంకులే లేకుండా వాహనాలు నేరుగా వెళ్లేలా

# ఆల్ టైమ్ రికార్డ్ ఒకే రోజులో 20 లక్షల IRCTC టికెట్లు!

పండుగల సీజన్ సమీపిస్తుండటంతో రైలు టికెట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తన చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ నెల 7వ తేదీన ఒక్కరోజే 20 లక్షలకు పైగా టికెట్లను బుక్ చేసి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఐఆర్‌సీటీసీ చరిత్రలో రోజువారీ బుకింగ్‌ల సంఖ్య 20 లక్షల మార్కును దాటడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఐఆర్‌సీటీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 7న ఒకేరోజులో మొత్తం 20,06,353 టికెట్లు బుక్ అయ్యాయి. ఆ మరుసటి రోజు, సెప్టెంబర్ 8న కూడా రద్దీ కొనసాగి, 19,50,699 టికెట్లు బుక్ అయ్యాయి. గతేడాది పండుగ సీజన్‌లో నమోదైన అత్యధిక సింగిల్‌డే బుకింగ్ (18,40,203) కంటే ఇది 6 శాతం అధికం. ప్రస్తుతం రైల్వే రిజర్వ్‌డ్ టికెట్లలో దాదాపు 89 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయని, ఈ భారీ ట్రాఫిక్‌ను తట్టుకునేలా సాంకేతిక వ్యవస్థను బలోపేతం చేశామని ఐఆర్‌సీటీసీ తెలిపింది. భారీగా పెరిగిన ఈ ట్రాఫిక్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ఐఆర్‌సీటీసీ ఇటీవల కీలక మార్పులు చేసింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేస్తూ కొత్త సర్వర్లను ఏర్పాటు చేసింది. అంతేగాక 2026 జులై 15న సరికొత్త వెబ్‌సైట్, యూజర్ ఇంటర్‌ఫేస్‌ను ప్రారంభించింది. ఈ కొత్త వెబ్‌సైట్‌లో ప్రయాణికులు వివిధ తరగతుల్లో సీట్ల లభ్యతను ఒకే స్క్రీన్‌పై చూసుకునే వెసులుబాటు కల్పించారు.
సాంకేతిక అప్‌గ్రేడ్‌లతో పాటు మోసపూరిత బుకింగ్‌లు, బాట్‌ల వాడకంపై ఐఆర్‌సీటీసీ ఉక్కుపాదం మోపింది. ఇందుకోసం ప్రవేశపెట్టిన యాంటీబాట్ సిస్టమ్ ద్వారా అనుమానాస్పద బాట్ ట్రాఫిక్‌ను 5565 శాతం తగ్గించగలిగినట్లు సంస్థ వెల్లడించింది. అలాగే, బుకింగ్ విండో తెరుచుకున్న మొదటి 10 నిమిషాల పాటు (ఉదయం 8 నుంచి 8:10 వరకు) అధీకృత ఏజెంట్లు టికెట్లు బుక్ చేయకుండా నిబంధన విధించింది. రిజర్వేషన్ విండో ఓపెన్ అయినప్పుడు టికెట్లు బుక్ చేసే యూజర్లకు ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా తప్పనిసరి చేసింది. ఈ చర్యల్లో భాగంగా మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న 3.04 కోట్ల యూజర్ ఐడీలను డియాక్టివేట్ చేసినట్లు, మరో 6.33 కోట్ల ఐడీలను రీవెరిఫికేషన్ కోసం ఫ్లాగ్ చేసినట్లు ఐఆర్‌సీటీసీ స్పష్టం చేసింది. ఇంత భారీ

# ఎన్జీటీ నోటీసులు మూసీ ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

# ఏఐతో ఐసిస్ వల టార్గెట్ భారత యువత

ఐసిస్, అల్‌ఖైదా వంటి భయానక ఉగ్రవాద సంస్థలు తమ పంథాను పూర్తిగా మార్చుకున్నాయి. భౌతిక దాడుల స్థానంలో భావజాల వ్యాప్తి, రాడికలైజేషన్‌ను ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నాయి. ఈ ప్రమాదకర వ్యూహాన్ని అమలు చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయని ఐక్యరాజ్యసమితి (ఐరాస) నివేదిక హెచ్చరించింది. ముఖ్యంగా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్రవాద భావజాలం వైపు ఆకర్షిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన 'కౌంటర్‌టెర్రరిజం కమిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరేట్' (సీటీఈడీ) విడుదల చేసిన తాజా నివేదికలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉగ్రవాద సంస్థలు ఏఐ, ముఖ్యంగా జెనరేటివ్ ఏఐ సహాయంతో వివిధ వర్గాలకు అనుగుణంగా ప్రచార కంటెంట్‌ను వేగంగా రూపొందిస్తున్నాయని తెలిపింది. పురుషులు, మహిళలు, యువతులు, యువకులు, చిన్నారులు.. ఇలా ప్రతి ఒక్కరి మానసిక స్థితికి తగ్గట్టుగా సందేశాలను తయారుచేసి, వాటిని వేగంగా వ్యాప్తి చేస్తున్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతిచోటా ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతోనే ఈ ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయని వివరించింది. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు కూడా ఈ పరిణామాలను ధ్రువీకరిస్తున్నారు. భారత్‌లో ఐసిస్, అల్‌ఖైదా సంస్థలు ఏఐని ఉపయోగించి మహిళలు, చిన్నారులను ప్రత్యేకంగా లక్ష్యం చేసుకున్నాయని ఓ అధికారి తెలిపారు. చిన్న వయసులోనే పిల్లల బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిలో తీవ్రవాద భావజాలాన్ని నింపి భవిష్యత్తుకు సిద్ధం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిలను, యువతులను ఆకర్షించేందుకు రక్షణ, గుర్తింపు వంటి అంశాలను వాడుకుంటుండగా.. అబ్బాయిలను హింస ద్వారానే శక్తి, గౌరవం లభిస్తాయనే పద్ధతిలో రెచ్చగొడుతున్నారని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఈ ఏఐ ఆధారిత ప్రచార నమూనాను ఐసిస్ విజయవంతంగా ఉపయోగిస్తోందని, నిఘా వర్గాలు గుర్తించాయి. ఇలా భావజాల వ్యాప్తికి గురైన వారు నేరుగా దాడులకు పాల్పడకుండా నిశ్శబ్దంగా తమ పనిని చేసుకుపోతుండటంతో వీరిని గుర్తించడం కష్టంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఇతర ఉగ్రవాద సంస్థలు కూడా ఇదే పంథాను అనుసరించే ప్రమాదం ఉందని నిపుణులు

# ఎడారిలో కొత్త నగరం 6,000 ఇళ్లతో 'మాన్యుమెంట్ హిల్స్'

లాస్ వెగాస్‌లో భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నగరంలో పెరుగుతున్న గృహ అవసరాలను తీర్చే లక్ష్యంతో 'మాన్యుమెంట్ హిల్స్' పేరుతో ఒక భారీ మాస్టర్‌ప్లాన్డ్ కమ్యూనిటీని నిర్మించేందుకు డెవలపర్లు సిద్ధమయ్యారు. ఇందుకోసం 94 మిలియన్ డాలర్లు వెచ్చించి సుమారు 940 ఎకరాల ఫెడరల్ ఎడారి భూమిని కొనుగోలు చేశారు. ఒలింపియా కంపెనీస్, బ్రూయిన్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. లాస్ వెగాస్ ఉత్తర సరిహద్దులో, లాస్ వెగాస్ పైయూట్ తెగకు చెందిన స్నో మౌంటెన్ రిజర్వేషన్‌కు సమీపంలో ఈ భూమి ఉంది. బ్యూరో ఆఫ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ (బీఎల్‌ఎం) ఈ భూమిని లాస్ వెగాస్ నగరానికి విక్రయించగా, నగరం దానిని డెవలపర్‌లకు కేటాయించింది. గత రెండు దశాబ్దాలలో లాస్ వెగాస్ వ్యాలీలో బీఎల్‌ఎం చేపట్టిన అతిపెద్ద భూ విక్రయం ఇదే కావడం గమనార్హం. ఈ ప్రాజెక్టులో భాగంగా, సామాన్యులకు అందుబాటులో ఉండే ఇళ్ల నుంచి అత్యాధునిక ఎగ్జిక్యూటివ్ గృహాల వరకు మొత్తం 6,000 ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమీపంలోని సైనిక స్థావరాలను దృష్టిలో ఉంచుకుని, సైనిక కుటుంబాలు, ఇతర ఉద్యోగుల కోసం వందలాది గృహాలను ప్రత్యేకంగా కేటాయించారు. వీటితో పాటు రెండు పాఠశాలలు, వాణిజ్య సముదాయాలు, సుమారు 90 ఎకరాల్లో పార్కులు, వాకింగ్ ట్రయల్స్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. 2028 వసంతకాలం నాటికి తొలి దశ ఇళ్లు అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. భూ విక్రయం ద్వారా వచ్చిన 94 మిలియన్ డాలర్ల ఆదాయంలో 85 శాతం నిధులను రాష్ట్రవ్యాప్తంగా పార్కులు, పర్యావరణ పరిరక్షణ, అటవీ ప్రాంతాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు వినియోగించనున్నారు. మరో 5 శాతాన్ని విద్యారంగానికి, 10 శాతాన్ని దక్షిణ నెవాడా నీటి అథారిటీకి కేటాయించారు. రాబోయే దశాబ్దంలో నెవాడా జనాభా భారీగా పెరగనుందన్న అంచనాల నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ గృహ కొరతను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు.

# కృష్ణా నీటికి ప్రత్యామ్నాయంగా బోరు ఏర్పాటు

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ నుంచి సరఫరా అయ్యే కృష్ణా జలాలకు ఎలాంటి అంతరాయం ఏర్పడినా 23వ వార్డు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దిశగా మరో ముందడుగు పడింది. వార్డు ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని గురువారం 23వ వార్డులో బోర్ ఏర్పాటు కోసం బోరు వేయించారు. కృష్ణా నీటి సరఫరాలో సాంకేతిక సమస్యలు, పైపులైన్ మరమ్మతులు లేదా ఇతర కారణాలతో అంతరాయం ఏర్పడినప్పుడు రోజుల తరబడి నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్ తెలిపారు. ముఖ్యంగా వేసవికాలంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే సమయంలోనూ వార్డులో ప్రత్యామ్నాయ తాగునీటి వనరు అందుబాటులో ఉండేలా బోర్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల ప్రాథమిక బాధ్యత అని, నీటి సమస్య తలెత్తిన తర్వాత పరుగులు పెట్టడం కంటే ముందుగానే ప్రత్యామ్నాయ వనరులను సిద్ధం చేయడం అవసరమని ఆమె అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా



నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. "నీటి సరఫరా ఆగినా ప్రజల దాహం ఆగకూడదు. ప్రత్యామ్నాయ వనరులు సిద్ధంగా ఉండాలి. ప్రజల నీటి అవసరమే మా బాధ్యత.. ప్రజల సంక్షేమమే మా లక్ష్యం" అని బర్రె పూజిత-జహంగీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు రవివర్ధన్, వార్డు పెద్దలు నువ్వుల నరసింహ, తోట నారాయణ, నాయిని కృష్ణమూర్తి, నాయిని వెంకటేష్, తోట మహేందర్, తాడెం శ్రీధర్, నాయిని శ్రవణ్ కుమార్, గోపే బాబు, భూషపాక ఈశ్వర్ బాబు, బర్రె క్రాంతి, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## బిఎల్ఓ లకి గౌరవ వేతనం ఇవ్వాలి

**గరిడేపల్లి తాసిల్దార్ కి వినతి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: బి ఎల్ ఓ లు సిఐటియు ఆధ్వర్యంలో గరిడేపల్లి తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమాన్నిదేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎస్.కె యాకూబ్ మాట్లాడుతూ 2013 నుండి ప్రభుత్వానికి ప్రజలకి వారధిగా ఉంటూ సేవలందిస్తున్న బిఎల్ఓ లకి గౌరవ వేతన ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని యాకూబ్ అన్నారు నిరుపేద కుటుంబాలకు సంబంధించిన బిఎల్వోలు ప్రభుత్వానికి కొంత సర్వీస్ చేస్తే ప్రభుత్వం గుర్తిస్తుంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారు గౌరవ వేతనం ఇస్తారు అది ఒక మంచి ఆలోచనతో గత 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకి ఏదో నామమాత్రంగా మొదట్లో వెయ్యి పదిహేను వందల ఇచ్చి ఇంతవరకు ఒక పైసా ఇవ్వకుండా అనేక రాజకీయ ఒత్తిడితో రోజుకు 12 గంటలు డ్యూటీ చేసుకుంటూ సేవ చేస్తున్న బీఎల్ఓ లకి వెంటనే నెలకు 20 వేల చొప్పున ప్రభుత్వం వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి న్యాయం చేయాలని ఈ కార్యక్రమంలో రావుల వెంకన్న ఎం ఉమా సైదమ్మ ఎస్ నర్సిరెడ్డి జయమ్మ పద్మ వెంకన్న తదితరులు బిఎల్వోలు పాల్గొన్నారు

## విద్యార్థులకు క్రమశిక్షణ తోటే అభివృద్ధి సాధ్యం

**రాఘవేంద్ర గ్రూప్స్ చైర్మన్ ఎర్ర చంద్ర శేఖర్**



ప్రజాస్ఫూర్తి, జన్నారం : విద్యార్థులకు క్రమశిక్షణ తోనే అభివృద్ధి చెందడం జరుగుతుందని రాఘవేంద్ర గ్రూప్స్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్ లో జరిగిన రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల జూనియర్ విద్యార్థిని విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎర్ర చంద్ర శేఖర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కష్టంతో కన్నా ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలకు ఎదగడానికి అవకాశం ఉంటుందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర గ్రూప్స్ ఫౌండర్ ఎర్ర ప్రమీల, రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, రాఘవేంద్ర విద్యాసంస్థల డీన్ హేమలత షిండే, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, రాఘవేంద్ర లిటిల్ హన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, శీల శ్రవణ్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## 1 కేజీ గంజాయి పట్టివేత



కూకట్పల్లి ప్రజాస్ఫూర్తి: కూకట్పల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అంజయ్య నగర్ లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ ఏ టీం సీఐ రమేష్ సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో కుదినేత సోని అనే మహిళ వద్ద ఒక కేజీ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఆమెపై కేసు నమోదు చేశారు.గంజాయి పట్టుకున్న కేసులో సీఐతోపాటు ఎస్సై మధు, హెడ్ కానిస్టేబుల్ సంతోష్ ప్రసాద్, కానిస్టేబుళ్లు రవి, రాహుల్, రాజేశ్వరి, ఖలీద్ ఉన్నారు.నిందితురాలని, గంజాయిని కూకట్పల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ రమేష్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



దేవరుప్పుల/జనగామ, ప్రజాస్ఫూర్తి : ఇందిరమ్మ ఇళ్లు, ఎస్ఐఆర్ పై కలెక్టర్ పరిశీలన. మండల కేంద్రంలోని ఇందిర మ్మ ఇళ్ల నిర్మాణ పనులు, ఓటరు జాబి తా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (ఎ.స్.ఐ.అర్) ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలిం చారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు, నిర్మాణ పనుల పు రోగతిని తెలుసుకున్నారు. రెండు, మూ డు రోజుల్లో తలుపులు, సున్నం పను లు పూర్తి చేసి తదుపరి బిల్లుకు అర్హత పొందాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో S IR హియరింగ్ ప్రక్రియను పరిశీలించి, ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాల ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారు లను ఆదేశించారు. అవసరమైతే 200 2 ఓటర్ల జాబితాతో వివరాలను సరిపో ల్చుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఓట రు జాబితాలో ఉండేలా జాగ్రత్తలు తీ సుకుని, నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉం చేందుకు చెత్తాచెదారం, పిచ్చిమొక్కల ను తొలగించాలని అధికారులను ఆదే శించారు.

## కార్మికుల నిధుల మళ్లింపు తగదు పెన్షన్ ఇవ్వాలి

మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను దారి మళ్లించడం సరికాదని,60 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ టి యు సి ఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మహబూబాబాద్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్మికుల కోసం ఉన్న రూ.674 కోట్లను ఐటీఐలను ఏసిటీ సెంటర్లుగా మార్చేందుకు వాడటం కార్మిక ద్రోహమన్నారు.సమస్యలు పరిష్కరించకపోతే ఐక్య ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లికంటి వెంకన్న,ప్రధాన కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, నాయకులు కొమురయ్య,రాజు, సంతోష్ పాల్గొన్నారు.

## ప్రకృతి సేవకులను అభినందించిన శివస్వామి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంలో మూడు రోజులుగా నిర్వహించిన పారంపర్య రాష్ట్ర 3వ మహాసభలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైవక్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతులు, ఋషిరత్న బిరుదాంకితులు శ్రీశ్రీశ్రీ శివస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి సేవ చేస్తున్న మొక్కల వెంకటయ్య, మొక్కల కె.ఎన్. రాజశేఖర్, నైనిక రజువా, ఎండి. ఆఫాన్ జైదీలను శివస్వామి ప్రత్యేకంగా అభినందించి ఆశీర్వదించారు. ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా స్వామీజీకి మొక్కను అందజేశారు. మహాసభలలో 500 రకాల ఔషధ మొక్కలను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేసిన మొక్కల వెంకటయ్యను స్వామీజీ అభినందించారు. ప్రతిభ కనబరిచిన వారికి స్వామీజీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ట్రెడిషనల్ డీలర్స్ ట్రైనింగ్ వర్క్‌షాప్, మెడికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ సర్టిఫికెట్లను కూడా అందించారు. ఈ కార్యక్రమంలో మల్లిశాల స్వామీజీ, కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర రాజు, సజ్జన రమేష్, దొంతు యాత్రి మహారుషి, బండి వెంకటేశ్వర్లు, ఎం.డి. జమాల్ ఖాన్, రామంచి శ్రీనివాస్, భాను ప్రసాద్, దుర్గారాణి, అరుణ, వీరభద్రాచారి, రామకృష్ణ, వాహేదలి, బొబ్బిలి మోహన్, పద్మారావు, సిహెచ్. రవీందర్, రాచూరి రాజు, జి. సుగుణారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల సమ్మె విజయవంతం




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు బిమేరకు దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోయాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన వివిధ బ్యాంక్స్ కి సంబంధించిన ఉద్యోగులందరు స్థానిక భువనగిరి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ ఆఫీసు నుంచి ర్యాలీ గా బయల్దేరి పాత బస్టాండ్ మీదుగా వినాయక చౌరస్తా వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య సెక్రటరీ కె. సురేష్ మాట్లాడారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ 5 రోజుల పని దినాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ లో చూపుతున్న వివక్షతకు వ్యతిరేకంగా సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 28,29,30 న వరుసగా మళ్ళీ సమ్మె లో పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆఫీసర్స్ అసోసియేషన్ సిసి మెంబర్ ఈ రఘు, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, నల్గొండ జిల్లా కోపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## దళితులు ఉన్నత స్థానాల్లో ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతోంది



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. దళితులు ఉన్నత పదవుల్లోకి ఎదగడాన్ని ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ అధికార ప్రతినిధి దూడెం వెంకట రమణ, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రెడ్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు వింటే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దళితులపై ఏనాడూ నిజమైన ప్రేమ లేదని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా అన్ని సదుపాయాలు, హోదా అనుభవిస్తూ కూడా శాసనసభ సమావేశాలకు హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం శాసనసభ పట్ల బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోందన్నారు. చౌక్కాలు విప్పేసి, పోలీసుల పట్ల ఇష్టారీతిన వ్యవహరించడం ప్రజాప్రతినిధులకు తగదన్నారు. కేటీఆర్, హరీశ్ రావు తదితర బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసుల పట్ల వ్యవహరిస్తున్న తీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. కె సి ఆర్ ఫామ్ హౌస్ కు దళితులు వచ్చి వెళ్లిన తరువాత పసుపు నీళ్లతో కడగడం ద్వారా దళితుల ను అవమానించారని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై, ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.



## మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

- **డీఈ కార్యాలయం ఎదుట మహ్మదాపూర్ గ్రామస్థుల ధర్నా..**

హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ డీఈ కార్యాలయం ఎదుట మహ్మదాపూర్ గ్రామస్థులు శుక్రవారం ధర్నా చేపట్టారు. గ్రామంలో మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ స్తంభాలు పాతినప్పటికీ ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ముఖ్యంగా లైన్ ఇన్‌స్పెక్టర్ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే గ్రామంలోని విద్యుత్ సరఫరా సమస్యలు కొంతమేర పరిష్కారమవుతాయని రైతులు గృహ వినియోగదారులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. స్తంభాలు పాతి అవసరమైన ఏర్పాట్లు చేసిన తర్వాత కూడా ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆలస్యం చేయకుండా వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించే వరకు అధికారులను సంప్రదిస్తామని గ్రామస్థులు తెలిపారు.

## సింగరేణి ఉద్యోగి మానుకొండ చంద్రశేఖర్ కు నివాళులర్పించిన సెక్యూరిటీ సిబ్బంది



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : కొత్తగూడెం సింగరేణి ప్రాంతం బర్మా క్యాంపులో ఉన్నటువంటి సత్తుపల్లి సింగరేణిలో జమీదర్ గా పని చేస్తున్న మానుకొండ చంద్రశేఖర్ మృతి వార్త తెలుసుకొని ఆయన భౌతిక దేహం పై పూలమాలవేసి నివాళులర్పించిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితోపాటు సింగరేణి ఉద్యోగులు. ఈ సందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు . ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు , జూనియర్ ఇన్స్పెక్టర్ విజేందర్ , కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ , విద్యానగర్ కాలనీ వార్డ్ మెంబర్ మాలోత్ శంకర్ , వంగపండ్ల సుమన్, జిమిడి మల్లేష్ , వంగలపూడి సుమన్ , బండ కుమారస్వామి , ఎండి ఆసిఫ్ , శంకర్ , వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సింగరేణి ఉద్యోగులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడును కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడును వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు కలిసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ ముద్దాపురం సర్పంచ్ సామ రామ్ రెడ్డి నాయకులు కాసుల వెంకన్న గౌడ్ నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంభానికి ఆర్థిక సహాయంఅందజేసిన వాకిటి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండల సీనియర్ రిపోర్టర్ ఆలకుంట్ల కృష్ణ మాతృమూర్తి ఆలకుంట్ల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి, వలిగొండ పీఏసీఎస్ డైరెక్టర్ కల్మారి చంద్రయ్య, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, శ్రీదేవి భూదేవి వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గంజి అశోక్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చెవ్వ మధు ముదిరాజ్, వార్డు సభ్యులు ఉక్కుర్తి పద్మనరసింహ, నిమ్మల వెంకటయ్య, పోలేపల్లి ప్రభాకర్, మారబోయిన మత్స్యగిరి, గంగదారి అశోక్,ఉకుర్తి శీను, బోదాసు దుర్గయ్య, పిట్టల వెంకన్న, ఆలకుంట్ల రాములు, బూడిద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీఓ 97కు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ సిబ్బంది ర్యాలీ

- **జీఓ ను పునఃపరిశీలించాలని డిమాండ్.**



స్టేషన్‌ఘన్‌పూర్/జనగామ, ప్రజా స్ఫూర్తి : జీఓ నంబర్ 97ను వ్యతి రేకి స్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది నిరసన చేపట్టారు. కళాశాల నుంచి శివునిపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, జీఓ 97 ను పునఃపరిశీలించాలని, ఉద్యోగుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకో వాలని కోరుతూ సంబంధిత అధికారు లకు వినతిపత్రం సమర్పించారు.

# గణేష్ మండపాల వద్ద శాంతి భద్రతలు పరిరక్షణ అత్యంత కీలకం

**గరిడేపల్లి ఎస్ఐ బి శ్రీకాంత్ గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రాబోయే గణేష్ చవితి వేడుకలను శాంతియుత వాతరంలో జరుపుకోవాలని చట్ట నిబంధనలకు కట్టుబడి జరుపుకోవాలని గరిడేపల్లి ఎస్ఐ బి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండపాల నిర్వహణలో శాంతి భద్రత పరిరక్షణ అత్యంత కీలకమని పోలీసులు సూచించిన మార్గదర్శకాలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు ప్రతి ఉత్సవ కమిటీ తమ మండలం ఏర్పాటు వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో ముందస్తుగా అనుమతి పొందాలని మండపాల వద్ద సంస్కృతిక ప్రదర్శనతో డీజే సిస్టంలో వాడటం పూర్తి నిషేధం అన్నారు.మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని అగ్ని ప్రమాదాలు నివారణకు తగినంత నీరు ఇసుకను అట్లాగే గణేష్ ఉత్సవ కమిటీ వాలంటీర్లు మండపం దగ్గర అందుబాటులో ఉండి పూర్తి బాధ్యత వహించాలని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని రాత్రి 10 గంటల లోపు పూజలను ముగించుకోవాలని రహదారుల పైన ప్రజలకు రాకపోకలు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఆనంద ఉత్సవాల మధ్య శాంతియుతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని మండల ప్రజలకు ఉత్సవ కమిటీ సభ్యులకు ఎస్ఐ శ్రీకాంత్ కోరారు.

# వైశ్యుల అభివృద్ధికి మహా అడుగు.. 13న భూమిపూజ

**: గంగిశెట్టి ప్రమోద్ కుమార్.**

*** 13న ఉప్పల్ బాగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఫౌండేషన్ స్టోన్..**



జనగామ, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ ఉప్పల్ బాగాయత్‌లో తెలంగాణ ప్రభుత్వం ఆర్యవైశ్య మహాసభకు కేటాయించిన 5 ఎకరాల స్థలంలో వివిధ నిర్మాణాల కోసం 13వ తేది ఉదయం 10.30 గంటలకు భూమిపూజ, ఫౌండేషన్ స్టోన్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సీఎం ఎ. రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. అ నంతరం శ్రీనివాస కల్యాణం, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుం చి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో హాజ రై విజయవంతం చేయాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్య దర్శి గన్ను నరసింహులు, కోశాధికారి బేజగం భిక్షపతి తదితరులు కోరారు.

# దళిత గౌరవాన్ని అవమానిస్తే, ప్రజలే తీర్పు చెబుతారు

**: నూక కిరణ్ యాదవ్**




జనగామ, ప్రజాస్ఫూర్తి : దళితు ల ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ముందుంటుందని టీపీసీసీ అధికార ప్రతినిధి నూక కిరణ్ యాదవ్ అన్నారు. ఎర్రవల్లి ఘటనపై వచ్చిన 'శుద్ధీకరణ' ఆరోపణలపై సంబంధితులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల వివక్షకు తావులేదని డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అంకితభావమే ఆదర్శం ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై పాఠశాల ఖ్యాతిని పెంచిన ఇద్దరు ఉపాధ్యాయులను రెవా జిల్లా శాఖ ఘనంగా సత్కరించింది. 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన అంబటి సత్యవతి (ఎస్ జి టి బాలికల ప్రాథమిక పాఠశాల), పరికి శంకర్ (ఎస్ జి టి హనుమంతుని గూడెం) లను రెవా జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు భూక్య రాంజీ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో బద్రి నారాయణ మాట్లాడుతూ పాఠశాలనే కుటుంబంగా భావిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న వీరి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బానోతు బాలాజీ నాయక్,అకడమిక్ నోడల్ ఆఫీసర్ తోడేటి వెంకన్న,బుర్ర గోవర్ధన్,ఉపాధ్యాయులు వరలక్ష్మి ,లక్ష్మి,చామంతి,శిరీష,రష్మిత,సాయికుమార్,ప్రియాంక,నాగేంద్ర,సుమ లత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవాలకు ఎంపిక

గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి : జాతీయ స్థాయి ప్రేరణ ఉత్సవాలకు దేశంలో 20 మందిలో ఒక్కరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్మల్ చెరువు పదో తరగతి విద్యార్థి గుండబోయిన శ్రీరామ సూర్యాపేట జిల్లా నుండి ఎంపికయ్యారు . వీరి జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం గుజరాత్ లోని వడ్నాగర్ పట్నంలోని వె ర్నాకులర్ పాఠశాల ( ప్రధాని నరేంద్ర మోడీ చదివిన పాఠశాల ) నందు నవంబర్ 15 నుండి నవంబర్ 21 వరకు విలువ ఆధారిత కరికులంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఇట్టి ఎంపిక కార్యక్రమం వీరిని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నవంబర్ 2026 జిల్లా స్థాయిలో పరీక్షించామని తెలిపారు. నిన్న జిల్లా నోడల్ స్కూల్ నవోదయ ప్రిన్సిపాల్ ఆదినారాయణ ఎంపికను ప్రకటించారు నేడు జడ్పిహెచ్ఎస్ క ల్మలచెరువు ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాఠశాల యందు శ్రీరామ్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు శ్రీరామ్ ఇలాగే గొప్ప ఉన్నత స్థాయిలో ఉండాలని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కోరారు.

# ఘనంగా ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ జన్మదిన వేడుకలు

ప్రజాస్ఫూర్తి , భైంసా : నిర్మల్ జిల్లా పట్టణ కేంద్ర వాస్తవ్యులు ప్రముఖ బిజెపి సీనియర్ ముధోల్ నియోజకవర్గ నాయకులు భైంసా పట్టణ కేంద్రంలోని దారాబ్ జి జిన్నింగ్ ఫ్యాక్టరీలో జన్మదిన వేడుకలు కార్యకర్తలు, అభిమానులు నిరంతర ప్రజాసేవకుడు బోస్లే మోహన్ రావు పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం నియోజవర్గంలో ప్రతి పాఠశాలకి వాటర్ ప్యూరిఫైయర్లు, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు, సిద్ధమవుతున్న విద్యార్థులకు సొంతంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసి విద్యాభివృద్ధికి, నిరంతరంతరం సేవలు కొనసాగిస్తున్నారు. ముధోల్ నియోజకవర్గం లో బడుగు బలైన వర్గాలకు ఆపదలో అపద్బాంధవుడిగా నిలుస్తూ దాదాపు కొన్ని వందల మందికి తమవంతుగా ఇండ్లు కూలిపోయిన వారికి అలాగే నిరాశ్రయులైన పేదవారికి, తల్లి తండ్రి లేని అనాధ పిల్లలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాగే అందరికీ తమ వంతుగా సేవలు అందించడానికి



నేను ముందుగా ఉంటారని కార్యకర్తలకు అభిమానులకు బోస్లే మోహన్రావు పటేల్ జన్మదిన వేడుకల సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ పటేల్, డాక్టర్.బోస్లే గోపాలరావు పటేల్, ప్రముఖ పాత్రికేయులు కొత్తూరు శంకర్,వాగ్మారే కపిల్, అయిన్ల ముత్యం రెడ్డి, తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద మొత్తంలో పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం చాలా అభినందనీయమని బోస్లే మోహన్ రావ్ పటేల్ సంతోషం వ్యక్తం చేశారు.

# ఫామ్‌హౌస్ శుద్ధీకరణపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి

*** నూక కిరణ్ యాదవ్**

జనగామ, ప్రజాస్ఫూర్తి: దళితుల ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ముందుంటుందని టీపీసీసీ అధికార ప్రతినిధి నూక కిరణ్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ బోర్డుల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో దళిత ప్రజాప్రతినిధులకు గౌరవం దక్కలేదని విమర్శించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో దళిత నాయకులు వెళ్లిన అనంతరం 'శుద్ధీకరణ'




చేశారనే ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమైతే అది దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే చర్యేనని నూక కిరణ్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ ప్రసిడెంట్ లకావత్ ధనవంతి, మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి,తాజా మాజీ కౌన్సిలర్లు,నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైద్య సేవలకు 'ఉత్తమ సేవా' పురస్కారం

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పారంపర్య వైద్య రంగంలో ప్రకృతి వైద్యంతోపాటు, ఆల్టర్నేటివ్ థెరపిస్ట్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న జి. సుగుణారావుకు ప్రతిష్టాత్మక 'వైద్య ఉత్తమ సేవాపురస్కారం' అవార్డు లభించింది. భద్రాచలంలో నిర్వహించిన పారంపర్య వైద్య మహాసంఘం (పీవీఎంఎస్) రాష్ట్ర 3వ మహాసభలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. 3వ రోజు ముగింపు సందర్భంగా మహాసభలో యోగ గురువు, భారత ధర్మ దేవత బ్రహ్మచారి, శైవ క్షేత్ర పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ శివ స్వామీజీ, పారంపర్య వైద్య మహాసభ అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, మహర్షి గోశాల వ్యవస్థాపకులు సజ్జన రమేష్, పుత్తూరు చంద్రశేఖర రాజు, ఉపాధ్యక్షులు



రామంచి శ్రీనివాస్, కోశాధికారి దుర్గారాణి, వైద్యశ్రీ జమాల్ ఖాన్ల చేతులమీదుగా వైద్య సుగుణారావు అవార్డును అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుగుణారావు మాట్లాడుతూ పారంపర్య వైద్య విధానాలకు మరింత గుర్తింపు తీసుకురావడంతోపాటు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తానని తెలిపారు. అవార్డుతో సత్కరించిన పారంపర్య వైద్య మహాసంఘం రాష్ట్ర నాయకత్వానికి, శ్రీశ్రీ శివ స్వామిజిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారంపర్య వైద్య రంగానికి చెందిన పలువురు ప్రతినిధులు, వైద్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలకు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

*** మండప నిర్వాహకులకు హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచనలు**

హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండప నిర్వాహకులతో పోలీసు శాఖ ఆధ్వర్యంలోసమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హుస్నాబాద్ ఏసీపీ సదానందం హాజరై మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని, పరిమిత శబ్దంతోనే కార్యక్రమాలు నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు.



గణేష్ మండపాల వివరాలను పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద మంటలు, కొవ్వొత్తులు, దీపాలు ఏర్పాటు చేసినప్పుడు వాటిని నిర్లక్ష్యంగా వదిలివేయకూడదని అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు నీరు ఇసుక వంటి వాటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపాల వద్ద జనసమ్మర్థాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు కలగకుండా మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ శ్రీధర్, ఎస్సై లక్ష్మారెడ్డి ,గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, ప్రజాస్ఫూర్తి : వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ తో కలిసి వివిధ శాఖల అధికారుల తో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో రైతు లకు అనువైన ప్రదేశాల్లో కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేసి, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, గన్నీ బ్యాగులు, హమాలీలను అందు బాటులో ఉంచాలని సూచించారు. ధా న్యం రవాణా లారీలకు జీపీఎస్ ఏర్పాటు చేసి, వాహనాల ద్వారా ధాన్యం మళ్లింపును అరికట్టాలని తెలిపారు. గోదాముల సామర్థ్యాన్ని ముందుగానే పరిశీ



లించాలని, మహిళా సంఘాల సభ్యులకు కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి రైతు లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొ నుగోళ్లు నిర్వహించాలని కలెక్టర్ సూ చించారు. సమావేశంలో డీఆర్‌డీఓ భా స్కర్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సు రేష్‌రెడ్డి, డీఎం సీఎస్ హతిరామ్, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీ సీఓ కరుణ, రవాణా శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి, భైంసా: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. డీడబ్ల్యూవో వినూత్నతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించిన ఆయన, పోషణ మాసం కార్యక్రమాలను అక్టోబర్ 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గరిడేపల్లి లో దోమల నివారణకు ఫాగింగ్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రమైన గరిడేపల్లి గ్రామంలో దోమల సమస్య ఎక్కువగా ఉన్నందున గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్( పొగ) చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఉప సర్పంచ్ మాతంగి సంజీవ మరియు వార్డ్ మెంబర్లు చిక్కుల మట్టయ్య మేకపోతుల అఖిల్ మేకపోతుల నరేష్ మాతంగి గోపి గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని గ్రామంలోని అన్ని వీధులలో ట్రాలీ ఆటో ద్వారా దోమలను నివారించుటకు మందు పిచికారి చేయడం జరిగినది.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి విగ్రహాల పంపిణీ



మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.11వ వార్డు మదర్ థెరిస్సా సెంటర్,19వ వార్డు నెహ్రూ సెంటర్లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ పాల్గొని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.మట్టి విగ్రహాల వినియోగంతో చెరువులు,కుంటలు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత విగ్రహాలనే పూజించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్, అజయ్ సారధి రెడ్డి, బోడ రవి,సాల్వాది దిలీప్,పద్మం ప్రవీణ్,నిమ్మల శ్రీను,బానోత్ భాస్కర్ నాయక్, కమిషనర్ వినోద్ కుమార్,నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నను కలిసిన ఎన్ఎస్ యుఐ జిల్లా ప్రెసిడెంట్



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్ఎస్ యుఐ రెండోసారి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన అజ్మీర సురేష్ నాయక్ జిల్లా డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆమె అజ్మీర సురేష్ నాయక్ ను అభినందిస్తూ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని ఆమె పలు సూచనలు చేశారు . అనంతరం అజ్మీర సురేష్ నాయక్ డిసిసి అధ్యక్షురాలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు గడ్డం రాజశేఖర్, యూనియన్ నాయకులు అబ్దుల్ హమీద్, మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

# గీకురు రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

* మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్..



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ఉద్యమకారుడు,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్,చిగురుమామిడి మండల మాజీ జెడ్పీటీసీ,మాజీ సర్పంచ్ గీకురు రవీందర్ ఇటీవల మృతిచెందగా శుక్రవారం వారి స్వగృహానికి మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్,చొప్పదండి మాజీఎమ్మెల్యే బొడిగ శోభ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డిలు రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ తన సుదీర్ఘ ఉద్యమ సహచరుడు, ప్రజా సేవకుడు అయిన గీకురు రవీందర్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.తన ఆప్తుడైన రవీందర్ అకాల మరణం వారి కుటుంబానికే కాకుండా,చిగురుమామిడి మండల ప్రజలకు తీరని లోటని అన్నారు.వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మచ్చ పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల రవీందర్,తెలంగాణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కునచ్చుల మహేందర్,వెంకటేశ్వరపల్లె సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య,బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ కుమార్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సంజీవ్, ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ గునుకుల మధుసుదన్ రెడ్డి,అచ్చ రవీందర్,పిల్లి తిరుపతి, భీమర లక్ష్మణ్,తిప్పారపు శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గందే చిరంజీవి,పెసరి హరీష్,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పడాల శ్రీనివాస్,యువమోర్చా ప్రెసిడెంట్ సిద్ధంకి అనిల్, పార్టీ నాయకులు మామిడి రమేష్,గందె రమేష్,నక్క రాజేందర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్గొండ నెక్స షోరూమ్ లో సరికొత్త బాలెనో కారు ఘన ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండలోని నెక్స (పవన్ మోటార్స్) షోరూమ్ లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "ది స్టన్నింగ్ న్యూ బాలెనో" కారును నేడు ఘనంగా ఆవిష్కరించారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారుతి సుజుకి ఎండీ యోగేష్ గుప్తా సి బి హెచ్ (సౌత్ ఈస్ట్ జోన్ నెగ్జా , గణేష్ దత్తు ఆనంద్ రీజనల్ మేనేజర్, నెగ్జా మరియు ప్రత్యేక అతిథిగా కె సితీచ్ కుమార్ చీఫ్ మేనేజర్, ఎస్బిఐ నల్గొండ పవన్ మోటార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి టి ఎస్ ఎం ప్రతీక్ గుప్తా కంపెనీ సీసీఓ కె రవి రెడ్డి వీపీ ఎం రవీందర్ పాల్గొని, నూతన బాలెనో కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, "నెగ్జా అంటేనే స్టైల్, టెక్నాలజీ, సోఫిస్టికేషన్. ఈ కొత్త బాలెనోలో అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్, భద్రతా ప్రమాణాలు ఉన్నాయి. నల్గొండ వినియోగదారుల నుండి దీనికి అద్భుతమైన స్పందన వస్తుందని ఆశిస్తున్నాము" అని తెలిపారు. కొత్త బాలెనో డార్క్ బ్లూ / గ్రీన్ షేడ్ లో ఆకర్షణీయంగా ఉండి, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేడుకకు నెగ్జా సిబ్బంది, వినియోగదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.నూతన బాలెనో టెస్ట్ డ్రైవ్ బుకింగ్స్ నెగ్జా నల్గొండ (పవన్ మోటార్స్) షోరూమ్ లో అందుబాటులో ఉన్నాయని షోరూం మేనేజర్ ఎండీ జానీ పాషా తెలిపాడు.

# కలెక్టరేట్ ముందు కేవీపీఎస్ ధర్నా




మహబూబాబాద్ ప్రజాస్ఫూర్తి :ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఎక్స్ గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.బాధిత పేద కుటుంబాలకు చట్ట ప్రకారం అందాల్సిన పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ఇవ్వాల్సిన రూ.2.5 లక్షల ప్రోత్సాహక నగదు కూడా ఏళ్లుగా పెండింగ్ లో ఉందని, లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్ స్పందించి పెండింగ్ కేసులను సమీక్షించి న్యాయం చేయాలని కోరారు.అనంతరం అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ ధర్నాలో చేపూరి గణేష్,షేక్ ఖాదర్ బాబా,పెంటిక వెంకటరాములు,మచ్చ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 9,19 వ వార్డ్ లలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని,ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను నాటి వాటిని బాధ్యతగా సంరక్షించాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ లు సంపత్ ,మంజుల బత్తుల స్వరూప మున్సిపల్ అధికారులు మెప్మా ఆర్ పి లు వార్డ్ ప్రజలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వాసవి రక్షణ కవచం ఆధ్వర్యంలో ఆర్ధిక సహాయం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: కట్టుకున్న భర్త కానరాని లోకాలకు వెళ్లడంతో బిడ్డల మీదనే ఆధారపడుతున్న సూర్యాపేటకు చెందిన పేదింటి ఆర్యవైశ్య ఆడపడుచు నీలా రాజ్యలక్ష్మి(70) ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలు కావడంతో తొంటి ఆపరేషన్ చేయాలని డాక్టర్ సూచించగా శుక్రవారం శ్రీ వాసవి రక్షణ కవచం ఆధ్వర్యంలో పదివేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని ఆమె కూతురు ఉషారాణికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి రక్షణ కవచం నిర్వాహకులు బచ్చు పురుషోత్తం మాట్లాడుతూ సూర్యాపేటలో మొట్టమొదటిసారిగా శ్రీ వాసవి రక్షణ కవచం సోషల్ మీడియా వేదికగా దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యులకు సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ వాసవి రక్షణ కవచం అట్టడుగు వర్గాలలో ఉన్న పేదలకు ప్రతినెల రక్షణగా ఉంటుందని తెలిపారు శ్రీ వాసవి రక్షణ కవచం ఏర్పాటు చేసిన పది రోజుల్లోనే సుమారు 170 మంది సభ్యులుగా చేరి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి రక్షణ కవచం సభ్యులు కలకోట లక్ష్మయ్య, తప్సీ గాంధీ, చల్లా సత్యనారాయణ, మిట్టపల్లి రమేష్, దేవరశెట్టి నాగరాజు, సోమా ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు సహాయం అందించాలనే ఆలోచనతో ఈవాసవి రక్షణ కవచం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కందిమల్ల మధుసూదన్, కర్నాటి కృష్ణ, నూనె పాండయ్య, జర్నలిస్టు కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కొండన్నగూడ గ్రామంలో

## వి బి జి రాంజీ స్పెషల్ పథకం అవగాహన కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కొండన్నగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ జానంపేట అనురాధ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో వి బి జి రాంజీ స్పెషల్ పథకం గూర్చి గ్రామ సభ నిర్వహించారు. ఈ సం దర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన గ్రామంలో అభివృద్ధి జరగాలంటే ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకం ద్వారా గ్రామంలో అనేక రకాలుగా అనేక అభివృద్ధి పనులు జరుగుతాయి దీనిని రైతులు గ్రామ ప్రజలు తప్పకుండా ఉపయోగించుకోవాలి. దీని ద్వారా పండ్లు తోటలు, ఇంకుడు గుంతలు,కమ్యూనిటి ఇంకుడు గుంతలు,కోళ్ళ షెడ్స్, పశువుల కొట్టాలు, రైతులకు గ్రౌండ్ వాటర్ పెరుగుటకు పాంపాండ్స్, వాటర్ పీడర్ చానల్స్, బోర్లు రిచార్జి స్ట్రక్చర్స్, రైతులు ఒప్పందం ప్రకారం రహదారి పక్కన మట్టి తీసి రోడ్డుపై వేసి రోడ్డు బాగు చేసుకునే అనె రకాల పనులు చేసుకోవచ్చు. ఈ పనులన్నీ చేయడంవల్ల గ్రామాభివృద్ధి తో పాటు ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, ఉపసర్పంచ్ నర్సింహులు, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్,శ్రీరాములు యాదవ్, షాహేద బేగం, బాల్ రాజు, ఈజియస్ రాములు, సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్,అంగన్వడి అలివేలు,ఆశ వర్కర్ జ్యోతి, రాములు పొచయ్య, ముసిలయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ పై అసెంబ్లీ కి వెళ్లిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

* రైతుల సమస్య లు పరిష్కరించాలని డిమాండ్



ప్రజాస్ఫూర్తి, భైంసా: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోవడంలేదని బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల శంకర్ నేతృత్వంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు ట్రాక్టర్ పై అసెంబ్లీకి వెళ్లి నిరసన తెలిపారు. వర్ష పరిస్థితులతో పంటలు ఎండుతున్న తీరును వివరిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పసల్ బీమాను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫసల్ బీమా లేకపోవడం మూలంగా వర్షాభావ పరిస్థితులతో రైతుకు నష్టం జరుగుతున్న, బీమా పరిహారం అందడం లేదన్నారు. పాలకులు మారారే తప్ప, పాలన ఏమాత్రం మారలేదు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాహకం ములంగా రైతులు నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తుందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలన్నారు. గన్ పార్క్ నుండి ఎమ్మెల్యేలంతా ట్రాక్టర్ పై అసెంబ్లీకి వెళ్తుండగా గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీలో తమ గళాన్ని వినిపిస్తామని ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్యేలు తెలియజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

* జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




ప్రజా స్ఫూర్తి, భైంసా : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెలాఖరులోగా కొనుగోలు కేంద్రాల మ్యాపింగ్



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): వానాకాలం ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలో అధికారులతో ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రైస్‌మిల్లులు, రవాణా, గన్నీ బ్యాగుల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం నిల్వకు అవసరమైన స్థలాన్ని గుర్తించి సిద్ధం చేయాలని, రవాణా వాహనాలను సమకూర్చుకుని ఫిట్‌నెస్, జీపీఎస్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పౌరసరఫరాల డీఎం రాములు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్ లకు సన్మానం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని బాదంపల్లి గ్రామ ప్రజలతో ఏకమై బాదంపల్లి గ్రామాన్ని అభివృద్ధి పరచటంలో కృషిచేసిన గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ సామల భాగ్యలక్ష్మి లక్ష్మరాజం, లక్ష్మీనారాయణ లను శుక్రవారం రోజున బాదం పెల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మాదాడి పూర్ణచందర్రావు ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాదాడి పూర్ణచందర్రావు మాట్లాడుతూ సర్పంచ్ ఉప సర్పంచ్ లు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు కొనియాడారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెల్లవారుజామునే తండాలో పోలీసుల మెరుపు దాడి

* బెల్లం పానకం ధ్వంసం - 15 వాహనాలు సీజ్ - 6 గురిపై కేసులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ఎస్పీ ఆదేశాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మహబూబాబాద్ రూరల్ పోలీసులు శుక్రవారం ఉదయం 5 గంటలకు బోడగుట్ట తండాలో మెరుపు దాడులు చేశారు.రూరల్ సీఐ అంజలి,ఎస్ఐలు రాజు,రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 35 లీటర్ల గుడుంబా,1000 లీటర్ల బెల్లం పానకం పట్టుబడింది. 15 వాహనాలను సీజ్ చేశారు.బెల్లం పానకాన్ని అక్కడే ధ్వంసం చేయగా, వాహనాలకు జరిమానా విధించారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

# లోక్ అదాలత్ లో రాజీమార్గమే పరిష్కారం



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కు ఏర్పాట్లు పూర్తి చేశామని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళీమోహన్ ఆదేశాలతో మహబూబాబాద్ లో 4, తొర్రూరులో 1 బెంచీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం ఉదయం 10 గంటలకు జడ్జి కె. మురళీమోహన్ లోక్ అదాలత్ ను ప్రారంభిస్తారని, కక్షిదారులు సమయానికి హాజరై కేసులను రాజీ చేసుకోవాలని కోరారు.

# ప్రకృతికి హాని వద్దు మట్టి గణపతినే ముద్దు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో వినాయక చవితి ముందస్తు వేడుకలు ఘనంగా జరిగాయి. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు.విద్యార్థులు తాము తయారు చేసిన మట్టి గణపతులను, కూరగాయలు, పండ్లతో చేసిన వినూత్న గణపతులను ప్రదర్శించారు.డైరెక్టర్ కొనకంచి రామకృష్ణ మాట్లాడుతూ మట్టి గణపతితోనే పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మమత,ప్రిన్సిపాల్ నరసింహారావు,వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక సర్కార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాన్ కాడాస్ట్రల్ భూముల సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ,ప్రజాస్ఫూర్తి : నాన్ కాడాస్ట్రల్ భూముల సర్వేను వేగవంతం చేసి, ఖచ్చితత్వంతో సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం దేవరుప్పుల మండలం చౌడూరు గ్రా మంలో కొనసాగుతున్న సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రోజువారీ లక్ష్యా లను చేరుకోవాలని సూచించారు. గ్రా మం లో 1,625 ఎకరాల సర్వే లక్ష్యానికి గాను 1,315 ఎకరాల సర్వే పూర్తయిన ట్లు అధికారులు తెలిపారు. ఆరు సర్వే బృందాలు, ఆరు డీజీపీఎస్ రోవర్స్‌తో పనులు కొనసాగుతున్నాయని వివరిం చారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఏ.డీ మన్యంకొండ, తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మహేందర్, సర్వే యర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలాల సాధనకు టీయూడబ్ల్యూజే (ఐజేయు)రిలే దీక్షలు

*** టియుడబ్ల్యూ ఏ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ( టీయూడబ్ల్యూజే ఐ జె యు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు.ఈ మేరకు దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డికి యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్య అయిన ఇంటి స్థలాల కేటాయింపును ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కల పరమేష్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బోజు మదనాచారి, జిల్లా కోశాధికారి పి అశోక్ కుమార్, వంగాల శ్రీనివాసరెడ్డి, ఉయ్యాల లింగయ్య, ఎండి సయ్యద్, దోటి శ్రీనివాస్, ఊర రమేష్, సూరారపు రాంప్రసాద్, శ్రీరామోజు కనకాచారి, ఎస్కే సలీం, వినోద్, కారింగి శ్రీను, సోమ చంద్రశేఖర్, సాగర్, చింత యాదయ్య, డీఎస్ యాదవ్, రాజు వనమాల,పుల్లెంల సందీప్, కొండ నరసింహ స్వామి, రెడ్డిపల్లి యాదగిరి, దశరథ, భాస్కర్, విజయ్, జగదీశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న ఆరుగురు అరెస్ట్

*** 10 గ్రాముల గంజాయి, కారు, స్కూటర్, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం**

లింగాలఘణపురం/జనగామ,ప్రజా స్ఫూర్తి : గంజాయి సేవిస్తున్న ఆరుగురి ని లింగాలఘణపురం పోలీసులు అరె స్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గురువారం సాయంత్రం బండ్ల గూడెం గ్రామంలోని కెనాల్ పక్కన ఉన్న టేకు తోట వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుం డగా ఆ రుగురు గంజాయి సేవిస్తున్న ట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నా రు.పోలీసుల వివరాల ప్రకారం లింగాల ఘణపురానికి చెందిన బాకీ ప్రసాద్, న క్కల సాయికృష్ణ, బండ్లగూడెం కు చెం దిన పులి సందీప్, కళ్లెం గ్రామానికి చెం దిన సంఘీ ప్రశాంత్, మాణిక్యపురానికి చెందిన మరికుక్కల కనకరాజు, నాగ రాజులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 గ్రాముల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు,ఒక కారు, ఒక స్కూటర్ స్వా ధీనం చేసుకున్నారు. కేసు నమోదు చే సి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించిన ట్లు పోలీసులు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు తెలిసి న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారిపై వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# దూసుకెళ్తున కారు పార్టీ

*** బీఆర్ఎస్ లో పలువురు చేరిక**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కేశంపేట మండలం బొదునంపల్లి గ్రామ కంటెస్టెంట్ సర్పంచ్ శేఖర్ యాదవ్ మరియు మాజీ ఉపసర్పంచ్ లింగా రెడ్డి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి షాద్నగర్ కార్యాలయంలో శేఖర్ యాదవ్ మరియు లింగారెడ్డికి పార్టీ కండువా కప్పి పార్టీలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శేఖర్ పంతులు,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,యారం శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం

*** చైర్మన్‌పై నిరాధార విమర్శలు మానుకోవాలి : కాంగ్రెస్ నేతలు**




జనగామ, ప్రజాస్ఫూర్తి : మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణిపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సి లర్ మేడే శ్రీనివాస్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో చెత్త వాహనాలు లేక, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. ప్రస్తుతం చైర్మన్ ప్రత్యేక చొరవతో 54 మంది పారిశుధ్య కార్మికులను నియ మించి, 11 కొత్త వాహనాలను అందు బాటులోకి తెచ్చి, ప్రజలకు పరిశుభ్ర మై న తాగునీరు అందిస్తున్నామని తెలిపా రు. మున్సిపల్ అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చ రించారు. ఈ సమావేశంలో వంగాల మ ల్లారెడ్డి, నీరటి రజిని,మంత్రి సుమలత, దోర్నాల అనిత,బాల భరద్వాజ (నాని) , బాస్కర్,రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శం

*** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటము నిస్వార్థంగా చేసిన పోరాటం అని,సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి బావి తరాలకు అందించాల్సిన అవసరం వున్నదని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80 వ వార్షికోత్సవాల సందర్భంగా సిపిఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ మండలంలోని పొనుగోడు గ్రామం లో, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన ఆస్తిలో కుమారుడితో సమానం గా పార్టీ కి ఆస్తిని పంచి ఇచ్చిన మహా మనిషి అనుమాల లింగయ్య స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజాం నవాబ్ నిరంకుశంత్వానికి వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం, 1946 నుండి 1951 వరకు చారిత్రాత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాల వద్ద, పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండా లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏ ఐ టియు సి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బిల్లా కనకయ్య,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి,వేశాల ఆంజనేయులు,కుందూరు వెంకటరెడ్డి,పోకల ఆంజనేయులు, రంగాపురం గ్రామ సర్పంచ్ కట్టా కళ్యాణి,ప్రతాని సైదులు, చేవ్వా వెంకన్న, సాగి వెంకటేశ్వరావు,కుంభం వెంకటి,రెడపంగు సైదులు,పగడాల శ్రీనివాస్,బాల శౌరి, నవీన్ చారీ,అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పంగ గోవిందు ,పంగా సైదులు, ఈశ్వరాచారీ, పంగ సైదయ్య, సోమయ్య, బండారు నాగయ్య, లక్షమయ్య,జక్కంపూడి శ్రీనివాస్,షేక్ నబి సాహెబ్,పీర్ సాహెబ్,దొండపాడు సైదులు,నబి సాహెబ్, ఈద నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# గండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : ఇప్పలపల్లి గ్రామ ఉప సర్పంచ్ వినోద్‌కుమార్‌తో పాటు పలువురు గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. గండ్ర వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్‌ను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంలో పార్టీకి దూరమైనవారు తిరిగి బీఆర్ఎస్‌లోకి రావాలని పిలుపునిచ్చారు. గండ్ర జ్యోతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల కు ప్రభుత్వం న్యాయం చేయాలి

*** సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



జనగామ, ప్రజాస్ఫూర్తి: జనగామ పట్ట ణంలో మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు, వాటిలో నిర్మించిన డబుల్ బె డ్‌రూమ్ ఇళ్లను సీపీఎం రాష్ట్ర కార్యద ర్శి జగ్గుల జాన్ వెస్లీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2012-13 లో 1,144 మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చినా మౌలిక వసతు లు, గృహ రుణాలు కల్పించకపోవడం తో వారు ఇళ్లు నిర్మించుకోలేకపోయా రని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని 72 మంది పేదలకు 2023లో డ్రా ద్వారా కే టాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వారికే అప్పగించాలని ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మో కు కనకారెడ్డి, నాయకులు ఇర్రి అహల్య, బోట్ల శేఖర్, రాపర్తి రాజు, సింగారపు రమేష్, మూడో వార్డు కౌన్సిలర్ బూడి ది జ్యోతి,లబ్ధిదారుల అధ్యక్షులు కళ్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ఎస్ బిఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఐతగాని మహేష్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సూర్యాపేటలో బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలి నిర్వహించారు. ఎస్ బి ఐ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు శనివారాలు సెలవులు ఉండగా, మిగిలిన రెండు శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీల శ్రీనివాస్, రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు, వికాస్, హేమలత, ప్రియాంక, సురేష్, నవీన్, కిషోర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు వినూత్న కార్యక్రమాలు

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల ఆరో గ్యం, ఆత్మగౌరవం, వ్యక్తిగత భద్రత, హ క్కుల పరిరక్షణకు జిల్లాలో వినూత్న కా ర్యక్రమాలకు శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 'నా ఆరోగ్యం - నా ఆత్మగౌరవం', 'నా శరీరంనా హక్కు - నా భద్రత', 'పాఠశాల విపత్తు నిర్వహ ణ ప్రణాళిక' బుక్‌లెట్లు, ఫ్లెక్సీలు, గోడ పత్రికలను అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ తో కలిసి ఆవిష్కరించారు. బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యే క శిక్షణను ఈ నెల 20లోగా పూర్తి చే యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వాణిశ్రీ, ఈఈ పీఆర్ రవీందర్, అగ్నిమాపక శాఖ అధికారి రేమండ్ బా బు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మం డల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీజీఎంఎస్, సం క్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు తదితరు లు పాల్గొన్నారు.

# జపాన్ డెలిగేట్ చారుగుండ్ల రాజశేఖర్‌కు అంతర్జాతీయ ప్రశంసలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ నేతృత్వంలో జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయన పర్యటనలో పాల్గొన్న ప్రముఖ ఉపాధ్యాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగుండ్ల రాజశేఖర్ అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన రీసెర్చ్ పేపర్ ప్రజెంటేషన్‌ను ప్రశంసిస్తూ జపాన్ అంతర్జాతీయ విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఆఖావో ప్రశంసా పత్రం అందజేశారు.సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జరిగిన పర్యటనలో తెలంగాణకు చెందిన 29 మంది ఉపాధ్యాయులు, విద్యా నిపుణుల బృందం జపాన్‌లోని ప్రముఖ విద్యాసంస్థలను సందర్శించి అక్కడి ఆధునిక విద్యావిధానం, రోబోటిక్స్, సాంకేతిక విద్య, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక అవసరాల పిల్లల విద్యా విధానాలను అధ్యయనం చేసింది. అంతర్జాతీయ వేదికపై చారుగుండ్ల రాజశేఖర్ చేసిన ప్రతిభావంతమైన ప్రజెంటేషన్‌ను గుర్తించిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్, స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్, విజయీభవ ట్రస్ట్, అవోపా కోదాడ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ నీలా సత్యనారాయణ, చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, కందిబండ వెంకటేశ్వరరావు, పైడిమర్రి నారాయణరావు, పైడిమర్రి సత్యబాబు, అవోపా జిల్లా అధ్యక్షులు ఇమ్మడి రమేష్ మండల విద్యాధికారి చత్రు నాయక్, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్క పౌరుని బాధ్యత

**- బొబ్బిళ్ళ మురళి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మట్టి వినాయకులను పూజించి.. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా నిర్వర్తించాలని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం కమిటీ చైర్మన్, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ తెలంగాణ ట్రస్ట్ సభ్యుడు బొబ్బిళ్ళ మురళి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో భారత్ సేవా సహకార ఫోరం ఆధ్వర్యంలో, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ తెలంగాణ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ సౌజన్యంతో చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో ట్రస్ట్ సభ్యుడు బొబ్బిళ్ళ మురళి శుక్రవారం ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షించడం ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అన్నారు. మట్టి వినాయకులను పూజించాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ట్రినిటీ విద్యాలయ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నరసింహ గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ కమిటీ ధర్మకర్తలు ఆవుల యేసు యాదవ్, వర్కాల రవి గౌడ్, బొబ్బిళ్ళ స్రామాట్ తదితరులు పాల్గొన్నారు.

# అడవుల పరిరక్షణలో అసువులు బాసిన వీరులకు ఘన నివాళులు



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం ఎఫ్డిఓ రామ్మోహన్ ఆదేశాల మేరకు అటవీశాఖ ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శుక్రవారం రోజున ఘనంగా నిర్వహించారు. అడవుల పరిరక్షణలో అసువులు బాసిన అటవీశాఖ అధికారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎఫ్ డి ఓ కార్యాలయం నుండి రేంజ్ అధికారులు,సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది వాచర్లతో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల రక్షణ, వన్యప్రాణి సంరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వలిగొండ గ్రామపంచాయతీలో జనరల్ బాడీ సమావేశం




వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు ఈకార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధికారి జి జలంధర్ రెడ్డి హాజరై గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు వలిగొండ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతగా భావించి గ్రామ అభివృద్ధిలో ముందుండాలని తెలిపారు అదేవిధంగా సమావేశంలో వార్డు సభ్యులు తమ తమ వార్డుల్లో ఉన్న సమస్యలు ప్రజల అవసరాలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు వార్డు సభ్యులు తెలియజేసిన ప్రతి అంశాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ వివరంగా నమోదు చేసుకొని డాక్యుమెంట్ చేశారు ఆయా అవార్డుల అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తెలిపారు అదేవిధంగా సమావేశానికి హాజరైన స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడటంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అన్నారు ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వివరిస్తూ పోలీస్ శాఖకు సహకరించినప్పుడే మండలంలో శాంతి సామరస్యం మరియు సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పగలమని అన్నారు అనంతరం ఎంపీడీవో జలంధర్ రెడ్డి ని ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని నూతన గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్ ను సర్పంచ్ శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదన విరమించుకోండి

* అసెంబ్లీలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : షాద్ నగర్ నియోజకవర్గంలోని సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే.. డంపింగ్ యార్డ్ ఏర్పాటును సిద్దాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు కొనసాగిస్తున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు.

# బిసిల ధర్మ పోరాటదీక్ష

* జిల్లా అధ్యక్షులు నోముల శ్రీకాంత్




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: దేశవ్యాప్తంగా కులగణనతోపాటు ప్రతి కులానికి ఒకే యూనిక్ కోడు కేటాయించాలని బిసి గణన చేసి ఓబిసి చేర్చాలని డిమాండ్ చేస్తూ బిసి ల ధర్మ పోరాట దీక్ష కలెక్టర్ కార్యాలయం ముందు శుక్రవారం బిసి సంక్షేమ సంఘం ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జన గణనలతో పాటు కులగణన చేయాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో బీసీల అందరు ఐక్యమై పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ ఆదేశాల మేరకు తెలంగాణాలో అన్ని జిల్లా కేంద్రాలలో ధర్మపోరాటలదీక్ష చేస్తున్నట్టు, జిల్లా అధ్యక్షులు నోముల శ్రీకాంత్ అన్నారు. ఈ ధర్నాలో గౌరవ అధ్యక్షులు గంగారాం, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింతల నరసింహులు, మెదక్ అసెంబ్లీ బీసీ సంఘం అధ్యక్షులు సాప రవి, వికలాంగుల, మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీదేవి, సభ్యురాలు ప్రధాన కార్యదర్శి శభానా, కోశాధికారి సుంకోజ్ దామోదర్ చారి, బీసీ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు గణేష్, రాము, లక్ష్మయ్య, బీసీ సంఘం నాయకులు సిద్దయ్య పోచయ్య శ్రీను, గోపాల్, అంజయ్య, వెంకట్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# టీజీ పీజీ ఎల్ సెట్ 2026 వెబ్ కౌన్సెలింగ్ రెండవ దశలో సీట్ల కేటాయింపు



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : ఎల్ఎల్ ఎం కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించిన టీజీ పీజీ ఎల్ సెట్ 2026 వెబ్ కౌన్సెలింగ్ రెండవ దశలో సీట్ల కేటాయింపు విషయంలో, ట్రాన్స్జెండర్లకు కుల ఆధారిత రిజర్వేషన్ల పరిధిలోనే 'హారిజాంటల్ రిజర్వేషన్' ప్రయోజనాన్ని కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ఈ ధర్మాసనం, WP నం. 29772/2026లో 8/9/2026 నాటి ఉత్తర్వు ద్వారా ఈ నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ మహిళా వర్గానికి చెందిన పిటిషనర్ 'మాత శ్రీ జానకమ్మ'కు మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీటు లభించలేదు; దీంతో ఆమె తన న్యాయవాది డాక్టర్ ఎస్.బి. మహ్మద్ ఇర్ఫాన్ అలీ అబ్బాస్ ద్వారా హైకోర్టును ఆశ్రయించి ఈ రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా, బషీర్‌బాగ్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన పి.జి. కాలేజ్ ఆఫ్ లాలో ఎల్ఎల్ ఎం. (జ్యూరిస్ప్రూడెన్స్) కోర్సులో ఆమెకు రెండవ దశ కౌన్సెలింగ్‌లో సీటు కేటాయించబడింది. ఎల్ఎల్ ఎం. ప్రవేశ నిబంధనలలో ట్రాన్స్‌జెండర్ వర్గాన్ని చేర్చకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ఈ రిట్ పిటిషన్ ఇంకా విచారణ దశలోనే ఉంది మరియు దీని తదుపరి విచారణ రెండు వారాల తర్వాతకు వాయిదా పడింది. ట్రాన్స్‌జెండర్ల హక్కులను పరిరక్షించడంలోనూ, వారిని సమాజంలో భాగం చేయడంలోనూ ఈ నిర్ణయం ఎంతో కీలకమైనది.

# గరిడేపల్లి కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాలలో చట్టాలు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : కస్తూరి బా గాంధీ విద్యాలయం గరిడేపల్లి నందు బాల రక్ష భవన్ - జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల చట్టాలు మరియు వారి సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్కె. నాగుల మీర మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతి విద్యార్థి ఆలోచనా విధానంలో మార్పు రావాలని, భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యంతో చదువుకోవాలని, ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా తమ భవిష్యత్తు కార్యచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తు, సమాజం, తల్లిదండ్రుల పరిస్థితులు, ప్రస్తుత కాల ప్రభావాలకు లోనూ కాకుండా అర్థం చేసుకుని ముందుకు సాగాలని చెప్పారు. నిరుపేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ప్రేమను గౌరవించి, అన్ని విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించుకుని పాఠశాలకు మంచి పేరు తెచ్చించాలని సూచించారు. చైల్డ్‌లైన్ సభ్యుడు వంశీ చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. . పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ మాట్లాడుతూ పాఠశాల దశలో తీసుకునే నిర్ణయాలు జీవితానికి పునాది వంటివని, మంచి స్నేహాలను మాత్రమే ఎంచుకోవాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచాలని, పెద్దల పట్ల గౌరవం, విధేయతతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ వై. శైలజ, ఉపాధ్యాయులు జ్యోతి, సుహాసిని, అనూష, ఇందిరా పాల్గొన్నారు

# రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించండి

* రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి






ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జుగల్ కిషోర్ కండెవాల్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అసోసియేషన్ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ అంకిత్ కు రైస్ మిల్లులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం మిల్లింగ్ నిలిపివేత, బిల్లింగ్ సమయం లో ఏర్పడిన తరుగు, ఎఫ్ సిఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణ తోపాటు జిల్లాలోని అన్ని రైస్ మిల్లులు నేటి నుండి మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నామని మిల్లింగ్ ప్రక్రియలో ట్రాన్స్పోర్ట్, నూకలు, పరమ ఇతర తరుగుదలలు కలిపి సుమారు 15% నుండి 20% వరకు తరుగు వస్తుందని, ఈ తరుగుదలను ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో సరైన విధంగా తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లర్స్ కు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని, ఈ కారణం వల్ల ప్రస్తుతం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడిందని, ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరించకుండా రా రైస్ మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నప్పటికీ, మిల్లులకు కేటాయించబడుతున్న ధాన్యం రా రైస్ తయారీకి అనుకూలంగా లేకపోవడం వల్ల, దానిని రా రైస్ గా మిల్లింగ్ చేసి సరఫరా చేయటం సాధ్యం కాని పని పరిస్థితి నెలకొన్నదని కావున పై సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# దళితులు అంటే కేసీఆర్‌కు ఇంత అహంకారమా?

* బీఆర్ఎస్ నేతలకు బుద్ధి, జ్ఞానం ప్రసాదించాలని అంబేద్కర్‌కు వినతిపత్రం



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ నేతలు కరోళ్ల సురేందర్, జాంగారి రవి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. తాతా మధును బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు వంటి హామీలతో దళితులను మోసం చేశారని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. రానున్న రోజుల్లో దళితుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం మరింత గట్టిగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘు నాయక్, సీనియర్ నాయకులు ఆగిర్యాల కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేపల్లి కుమారస్వామి గౌడ్, కోగూరి పురుషోత్తంరెడ్డి, అన్మగల్ల రమేష్, జాకారం చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, గిరిజన విభాగం అధ్యక్షుడు శ్రీనునాయక్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా నర్సింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ.కరణ్‌కర్, ఎస్సీ విభాగం నేతలు బాధేపల్లి సిద్ధార్థ, కరోళ్ల సురేందర్, జాంగారి రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగి సాయిలు, బొరిగె నరేందర్, నాగిళ్ల భాస్కర్, అనంతయ్య, జక్కని రవికుమార్, మాస్టర్ ఆంజనేయులు, టౌన్ అధ్యక్షుడు సింగపాగా అనిల్‌కుమార్, సింగపాగా జంగయ్య, పద్మారం అశోక్, కొత్తూరు మాజీ సర్పంచ్ జనిగె జగన్, దళిత ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట రైస్ మిల్లర్ల ధర్నా

* బాయిల్డ్ రైస్ మాత్రమే తీసుకోవాలి



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం రైస్ మిల్లర్లను వేధించడం మానుకోవాలని న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రైస్ మిల్లర్ల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు శాంతియుత మహా ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన రైస్ మిల్లర్లు వారి సహాయకులు న్యాయం చేయాలని ప్లే కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ జిల్లా కార్యదర్శి రేపాల భద్రాద్రి రాములు మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసి సేకరించిన ధాన్యం మిల్లింగ్ చేయడానికి మా అసోసియేషన్ పరిదిలో గల మిల్లుల వారికి కేటాయించిన ధాన్యం మిల్లింగ్ చేసి సిఎంఆర్ సీఎంఆర్ డెలివరీ చేసే విషయంలో ప్రభుత్వం వారు అవలంబిస్తున్న విధానాలకు మేము ఎదుర్కుంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించి ఇబ్బందులు కలగకుండా చేయాలి అన్నారు. అనంతరం జేసీ కి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి, గౌరవ అధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి గ, తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గోళ్ళ రాంశేఖర్, జనరల్ సెక్రెటరీ బోగవెల్లి వెంకట రమణ చౌదరి (బాబీ), జనరల్ సెక్రటరీ 2 పోలిశెట్టి ధనంజయ్య, కోశాధికారి గందె రాము, నల్లగొండ సెంటర్ అధ్యక్షులు వీరుమల్ల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ తేలుకుంట్ల శ్రీనివాస్, నెకరికల్ సెంటర్ అధ్యక్షులు కన్మంత రెడ్డి కేశవరెడ్డి, జనరల్ సెక్రటరీ తౌనుపునూరి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు కొత్త విశ్వనాథం, దేవరకొండ సెంటర్ అధ్యక్షులు సముద్రాల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ శీల శ్రీనివాస్, హాలియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పేలపూడి బాలకృష్ణ, రైస్ మిల్లర్స్ చిట్టిపోలు కరుణా సాగర్, పందిరి శ్రీనివాస్, సముద్రాల అజయ్ కుమార్, ముప్పరపు శేఖర్, పాంపాటి యాదగిరి పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె



ఖమ్మం, ప్రజాస్ఫూర్తి : దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో పనిచేస్తున్న సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు గురువారం ఒకరోజు సమ్మె చేపట్టారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పొట్ల వెంకటాలయ ప్రాంతంలో బ్యాంకు ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు ఉద్యోగుల ప్రధాన డిమాండ్ 5 రోజుల పని వారాన్ని వెంటనే అమలు చేయాలనేది. ఇప్పటికే బ్యాంకు యాజమాన్యాలు, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ దీనికి అంగీకరించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి రావడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ రంగాల్లో శనివారం, ఆదివారం సెలవులు ఉండగా, బ్యాంకు ఉద్యోగులకు మాత్రమే నెలలో రెండు శనివారాలు మాత్రమే సెలవు ఉండటం అన్యాయమని వారు వాదిస్తున్నారు. వారి రెండవ ప్రధాన డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పీఎల్ఐ స్కీమ్ ను ఉపసంహరించుకోవాలని. ఈ స్కీమ్ లో తీవ్ర వివక్ష ఉందని, ఇది ఉద్యోగుల మధ్య చీలిక తెచ్చే విధంగా ఉందని ఆరోపిస్తున్నారు. పీఎల్ఐ స్కీమ్ ను రూపొందించే ముందు యూనియన్లతో ఎలాంటి చర్చలు జరపలేదని, ఇది ద్వైపాక్షిక ఒప్పందాలకు విరుద్ధమని యుఎఫ్బియు నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఒకరోజు సమ్మె కేవలం హెచ్చరిక మాత్రమేనని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో మూడు రోజుల నిరవధిక సమ్మెకు, అక్టోబర్ 26 నుండి పూర్తిస్థాయి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. ఈ సమ్మెలో ఎఐబీఈఎ, ఎఐబీఓసీ, ఎన్సీబీఈ, ఎఐబీఓఎ, బీఈఎఫ్ఐ, ఐఎన్బీఈఎఫ్, ఐఎన్బీఓసీ అనే ఏడు యూనియన్లు ఐక్యంగా పాల్గొన్నాయి.

# గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమై భోజనం అందించాలి

* స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శుక్రవారం అడ్డగూడూరు మండలం మంగమ్మగూడెం గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్టోర్ రూమ్‌ను పరిశీలించి, విద్యార్థులకు అందించేందుకు నిల్వ ఉంచిన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానాన్ని పరిశీలించారు. కూరగాయలు తాజాగా ఉన్నాయా, వాటిని పరిశుభ్రంగా, సక్రమంగా నిల్వ చేస్తున్నారా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఆహార పదార్థాలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిల్వ చేయాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్రంలో జీవనం సాగిస్తున్న కుటుంబానికి నూతన గృహం నిర్మించి అందజేత



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండలంలోని కల్మలచెరువు గ్రామంలో సత్రంలో జీవనం కొనసాగిస్తున్న అనాధ తల్లి బిడ్డకు దాత ఏవీ రెడ్డి సహకారంతో నూతన గృహాన్ని నిర్మించి శుక్రవారం అందజేశారు. ఏవీ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ కుక్కనూరు అంజయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, వార్డు సభ్యులు అమరవరపు నాగయ్య, కందుల త్రివేణి నవీన్, బొల్లగాని వెంకన్న, గ్రామ పెద్దలు సపిడి లచ్చిరెడ్డి, కమ్మలపల్లి వెంకటనారాయణ, టీఆర్ఎస్ పార్టీ నాయకుడు సపిడి శంభిరెడ్డి, ధనమూర్తి లక్ష్మయ్య, షేక్ రఫీ, మీసాల సైదులు, అనంత కోటయ్య, అమరవరపు శ్రీను, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐజిల్లా అధ్యక్షులుగా కవిడే సురేష్ ఎన్నిక



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన కవిడే సురేష్ 9,10 తేదీలలో చౌటుప్పల్ పట్టణంలో జరిగిన జిల్లా 3 వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కవిడే సురేష్ మాట్లాడుతూ నేను గతంలో ఎస్ఎఫ్ఐ సభ్యుడిగా, గ్రామ శాఖ అధ్యక్షుడుగా, మండల కార్యదర్శిగా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లా వ్యాప్త విద్యార్థుల సమస్యలపైన పనిచేయడం జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన సైకిల్ యాత్రలో పాల్గొని వారి సమస్యల పరిష్కారంలో ఉద్యమించానని మరియు డివైఎఫ్ఐ సంఘంలో మండల అధ్యక్ష కార్యదర్శి బాధ్యతతోపాటుగా జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేయడం జరిగింది. ఈ జిల్లాలో మత్తు పదార్థాలకు, గంజాయికి అలవాటుపడుతున్న యువతను చైతన్యం చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సైకిల్ యాత్రలో పాల్గొనడం జరిగింది. అదే విధంగా భవిష్యత్తులో ఈ జిల్లాలో ఉన్నటువంటి కెమికల్, ప్రైవేట్ పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగ యువకులకు ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన వాగ్దానాల అమలుకోసం పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.



# మలయాళ డైరెక్టర్‌తో బన్నీ మూవీ

రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే మరో మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. కెరీర్‌లో ఫస్ట్ టైమ్ ఓ మలయాళ డైరెక్టర్‌తో సినిమా చేయబోతున్నాడు. హీరో కమ్ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్‌తో ఓ సినిమా ఫిక్సైనట్లు సమాచారం. చాలా కాలంగా డిస్కషన్స్ జరుగుతున్నాయట. యూనివర్సల్ పాయింట్‌తో బాసిల్ జోసెఫ్ సిద్ధం చేసిన కథ బన్నీకి బాగా నచ్చినట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా మాస్, యాక్షన్ ప్రధాన పా-త్రల్లోనే కనిపిస్తున్న అల్లు అర్జున్...బాసిల్ జోసెఫ్ సినిమాలో మాత్రం ఫ్యామిలీ మ్యాన్‌గా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. స్వీయ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లోనే ఈ సినిమా చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు మలయాళంలో ఒకే సారి ఈ సినిమాను షూట్ చేయబోతున్నట్లు సమాచారం.

# సైఫ్‌పై దీపికా ఫ్యాన్స్ ట్రోల్స్



దీపికా పదుకోణ్ బ్లాక్‌బస్టర్ మూవీపై హీరో సైఫ్ అలీఖాన్ చేసిన కామెంట్లు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా హైవాన్ మూవీ ప్రమోషన్లలో అడిగిన ప్రశ్నకు సైఫ్ అలీఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాక్ టెయిల్‌లో నటించడమే నా కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పు. పాతకాలపు ఆలోచనలను ప్రోత్సహించే విధంగా ఉంది. ఇష్టం లే-కపోయినా కొన్ని పరిస్థితుల వల్ల నిర్మాణ బాధ్యతలు చేపట్టాను. ఆ సినిమా చేయడానికి హీరోలు ఎవరూ ముందుకు రాలేదు. ఎలాగైనా సినిమాను పూర్తి చేయాలనే కాక్ టెయిల్‌లో నేనే నటించా. ఇప్పటికీ ఆ సినిమా విషయంలో రిగ్రేట్‌గా ఫీలవుతుంటా. కాక్ టెయిల్‌తో పాటు హమ్‌షకల్స్ కూడా చేసుండాల్సింది కాదు" అని సైఫ్ అన్నారు. దీంతో అతని కామెంట్లను దీపికా ఫ్యాన్స్ తప్పుపడుతున్నారు. దీపికా వల్లే సినిమా ఆడిందనే నిజాన్ని ఒప్పుకోలేక సైఫ్ ఇలాంటి కామెంట్లు చేస్తున్నాడని అంటున్నారు.



త్రిప్తి డిమ్రి

# మీనా కుమారి బయోపిక్‌లో..

యానిమల్ మూవీతో బాలీవుడ్‌లో పాపులర్ అయ్యింది త్రిప్తి డిమ్రి. గ్లామర్ పాత్రలో తన అందాల ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈ సుందరి ఓవర్ నైట్‌లో స్టార్‌గా మారింది. అయితే గ్లామర్ పాత్రలు అంతగా కలిసి రాకపో వడంతో తన రూట్ మార్చింది. కమల్ ఔర్ మీనా పేరుతో తెరకెక్కుతున్న ఓ బయోపిక్ సినిమాను తొలిసారి అంగీకరించింది. అలనాటి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మీనా కుమారి జీవితం ఆధారంగా డైరెక్టర్ సిద్ధార్థ్ పీ మల్హోత్రా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇందులో మీనా కుమారి పాత్రలో త్రిప్తి కనిపించబోతోంది. మీనా కుమారి పాత్ర కోసం తొలుత అలియాభట్, శ్రద్ధాకపూర్, దీపికా పదుకోణ్ పేర్లు వినిపించినా చివరకు ఈ అవకాశం త్రిప్తిని వరించింది. ఇటీవలే హీరోయిన్‌గా ఈ బోల్డ్ బ్యూటీని డైరెక్టర్ ఫైనల్ చేసినట్లు సమాచారం.

# పడిపోయిన ప్రియా



ఇటీవల రిలీజై బంపర్ హిట్ అందుకున్న ఇరుముడి సక్సెస్ మీట్ తాజాగా హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా రవితేజ యూనిట్ సభ్యులకు షీల్డ్‌లను అందజేశారు. వాటిని స్వీకరించడానికి స్టేజ్‌పైకి వెళుతున్న సమయంలో హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ కిందపడిపోయింది. దీంతో అందరూ కంగారుపడిపోయారు. ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. డైరెక్టర్ శివ నిర్వాణ ఈ సినిమాను తెరకెక్కించగా సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో నటించారు. కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ ఇప్పటివరకు 250 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రికార్డులు సృష్టిస్తోంది.

# రామ్‌తో రొమాన్స్

మలయాళ బ్యూటీ సంయుక్త మీనన్ తెలుగులో మరో క్రేజీ ఛాన్స్ కొట్టేసింది. రామ్ పోతినేనితో రొమాన్స్‌కు రెడీ అయింది. రామ్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాలో హీరోయిన్ కన్ఫామ్ అయ్యింది. ఈ విషయాన్ని గురువారం మేకర్స్ అధికారికం-గా ప్రకటించారు. సంయుక్త బర్త్‌డే సందర్భంగా ఆమెకు విషెస్ చెబుతూ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సింపుల్ లుక్‌లో సంయుక్త కనిపించింది. ఆమె వెనుక వీ అనే అక్షరం ఉండటం ఆసక్తిని పంచుతోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రామ్ తమ్ముడు కృష్ణ పోతినేని నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కాగా ప్రస్తుతం తెలుగులో ఐదు సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది సంయుక్త.



## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| నెట్‌ఫ్లిక్స్ : | విశ్వనాథ్ అండ్ సన్స్ (తెలుగు)<br>చుంబక్ (హిందీ)<br>అన్‌టోల్డ్ రేగన్ (ఇంగ్లీష్)<br>ది టైమ్ ట్రావెలర్స్ వైఫ్ (ఇంగ్లీష్)<br>అనకొండ 3 (ఇంగ్లీష్) |
| అమెజాన్ ప్రైమ్ వీడియో: | మగుడం (తమిళం)<br>మహారాజా హాస్టల్ (మలయాళం)<br>రాక్షసపూరధూల్ (కన్నడ)<br>ది రివాల్యూషనరీస్<br>వెబ్‌సిరీస్ (హిందీ)<br>వన్ నైట్ ఓన్లీ (ఇంగ్లీష్) |
| జీ 5 ఓటీటీ: | వీరభద్రుని రహస్యం వెబ్‌సిరీస్ (తెలుగు)<br>పంచనామా వెబ్‌సిరీస్ (తెలుగు)<br>వరావు (మలయాళం)<br>గమాసాన్ (హిందీ) |
| ఆహా ఓటీటీ: | కట్టాలాన్ (తెలుగు)<br>వెంగెన్స్ (తమిళం) |
| జియో హాట్ స్టార్: | అలీబాబా ఔర్ 40భూత్<br>వెబ్‌సిరీస్ (హిందీ)<br>జంగిల్ టేల్స్ విత్ మోగ్లీ (హిందీ) |
| ఈటీవీ విన్: | బ్లూ స్టార్ (తెలుగు)<br>కొలవెరి (తెలుగు) |

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.